నమస్తే తెలంగాణ
# సూర్యాపేట
5 | నల్లగొండ, సోమవారం 25 మార్చి 2024 | SURYAPET

## యాదగిరి క్షేత్రం.. భక్తజన సంద్రం


ఆలయంలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట, మార్చి24 : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్రం ఆదివారం భక్తజన సంద్రంగా మారింది. సెలవుదినం కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో వచ్చారు. స్వామివారి ధర్మదర్శనానికి 3 గంటలు, ప్రత్యేక దర్శనానికి 2 గంటల సమయం పట్టిందని భక్తులు వెల్లడించారు.

# ఎండిన పొలాలే జీవాలకు మేత

- అడుగంటిన భూగర్భ జలాలు.. కనిపించని పచ్చదనం
- నీళ్లు లేక, మేత లేక పశువులకూ తప్పని అవస్థలు
- నీళ్లు లేక సగంలో వదిలేసిన పొలాలే కాపరులకు ఆధారం


దామరచర్లలో ఎండిన వరి పొలంలో మేస్తున్న జీవాలు

దామరచర్ల, మార్చి 24 : ముంచుకొస్తున్న కరువు మనుషులకే కాకుండా మూగ జీవాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. వానలు లేక, చెరువుల్లో నీరు లేక భూగర్భ జలాలు అడుగంటిపోయి తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడింది. దీంతోపాటు మండిపోతున్న ఎండలతో ఎక్కడా పశువులకు మేత దొరుకని పరిస్థితి నెలకొన్నది. ఇటీవల యాసంగిలో సాగు చేసిన పంటలు చేతికొచ్చే సమయానికి నీళ్లు లేక ఎండిపోవడంతో అవే మేతగా మారుతున్నాయి. దామరచర్ల మండలంలో అనేక మంది కాపర్లు జీవాల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ కాపర్లకు సబ్సిడీపై గొర్రెలను పంపిణీ చేశారు. వాటి ఆధారంగా అనేక మంది జీవాల మందను పెంచుతున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది కరువు కారణంగా జీవాల పెంపకం కష్టంగా మారింది. ఇప్పటి వరకు మంచి డిమాండ్ ఉన్న గొర్రెలకు మేతలేక తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

### ఎడారిలా మారిన భూములు

ప్రస్తుతం ఎక్కడ కూడా నీరు, మేత లేక పోవడంతో కాపర్లు ఇబ్బందులు పడుతున్నారు. దాంతో జీవాలను దూర ప్రాంతం వెళ్లి మేపుతున్నారు. ఒక్కొక్క కాపరికి 50 నుంచి 200 గొర్రెలు ఉన్నాయి. ప్రతి రోజూ ఏదో ఒక ఊరికి పోయి మేపుకొని వచ్చేవారు. ఇప్పుడు ఎక్కడకు పోయినా ఎడారిలా కనిపించడంతో ఏం చేయాలో తోయని పరిస్థితుల్లో కాపర్లు ఉన్నారు. భూగర్భ జలాలు ఇంకిపోయి బోర్లకింద వేసిన వరిపంట ఎండిపోవడంతో రైతులు కాపర్లకు అమ్ముకుంటున్న పరిస్థితి నెలకొన్నది. దాంతో ఎండిన పొలాలను కాపర్లు ఎకరానికి మూడువేల రూపాయల చొప్పున కొనుగోలు చేసి జీవాలను మేపుకొంటున్నారు. ఇప్పటి వరకు ఎండిన పొలాలు కాపర్లను ఆదుకున్నాయి. ఆ తర్వాత పరిస్థితి ఏంటనేది కాపర్లను ఆందోళనకు గురి చేస్తున్నది. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఏదో ఒక రేటుకు జీవాలను అమ్ముకుంటున్నారు.

### జీవాల పెంపకం కష్టంగా మారింది



కరువు కారణంగా జీవాల పెంపకం కష్టంగా మారింది. నేను 100 గొర్రెలను పెంచుతున్నా. జీవాలకు ఎక్కడకు వెళ్లినా మేత, నీరు దొరుకడం లేదు. ఇప్పటి వరకు రైతులు వదిలేసిన పొలాలను మేపుతూ గడిపాం. నెల రోజుల నుంచి 20 మంది రైతులు వదిలేసిన పొలాలను కొని జీవాలను మేపిన. ప్రస్తుతం అవికూడా లేకుండా పోయినయి. ఏం చేయాలో అర్థం కావడం లేదు. చెరువుల్లో చుక్కనీరు లేదు. గట్లపై మేతలేదు. పరిస్థితి ఇలాగే ఉంటే జీవాలను అమ్ముకోవాల్సి వస్తుంది.

– చింతలచెరువు శ్రీనుయాదవ్, దామరచర్ల, గొర్ల కాపరి

### కాపర్లకు గడ్డుకాలం వచ్చింది



గత పదేండ్లుగా ఎన్నడూ రాని కరువు ఇప్పుడు వచ్చింది. నేను వ్యవసాయంతో పాటు 30 జీవాలు పెంచుకుంటున్నా. కరువు కారణంగా పంటలు ఎండిపోగా జీవాలపై ఆధారపడ్డ. కానీ ఎక్కడా మేత లేక, తాపేందుకు నీరు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఈ ఏడాది చెరువుల్లో నీరులేదు. బోర్లన్నీ వట్టిపోయాయి. ప్రభుత్వం స్పందించి సాగర్ జలాలతో చెరువులు నింపి ప్రజల కష్టాలు తీర్చాలి.

– పగిడి కొండలు, దామరచర్ల


నల్లగొండలో రంగులు కొనుగోలు చేస్తున్న జనం

# నేడు హోలీ

## రంగుల కేళికి అంతా సిద్ధం

- సహజ రంగులే శ్రేయస్కరం
- ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపిన మండలి చైర్మన్ గుత్తా, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

రామగిరి/సూర్యాపేట టౌన్/పాలకవీడు, మార్చి 24 : వసంత రుతువు ఆగమనం మనసుల్లో ఉత్సాహమే కాదు.. ప్రకృతిలో సరికొత్త సొగసులు కూడా తెస్తుంది. ఎండిన చెట్లు చిగురించి పువ్వులతో పాటు కొమ్మలు కనువిందు చేస్తాయి. మల్లెలు విరబూస్తు సువాసనలు వెదజల్లుతాయి. ప్రకృతిలోని అందాలన్నీ ఆవిష్కరించే వసంత రుతువు ప్రవేశించిన తర్వాత జరుపుకొనే తొలి వేడుక హోలీ. ఇంద్రధనస్సులోని రంగులు ఒకచోట కుప్ప పోసినట్లు అందంగా, ఆహ్లాదంగా రంగోళిని చిన్న, పెద్ద తేడా లేకుండా జరుపుకొనే వేడుక ఇది. సోమవారం హోలీ సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేడుకకు చిన్నా, పెద్ద సిద్ధం చేసుకున్నాడు. ఆదివారం రాత్రి కాముని దహనం చేశారు. ఆటపాటలతో యువత ఉత్సాహంగా గడిపారు. హోలీలో రసాయనాలకు బదులు సహజ సిద్ధంగా లభించే రంగులను వాడడం శరీరానికి మంచిదని వైద్య నిపుణులు చెబుతున్నారు. వసంత కాలంలో మోదుగు చెట్లు విపరీతంగా పూస్తాయి. జిల్లా ప్రజలకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ మంత్రి, సూర్యాపేట శాసన సభ్యుడు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. పచ్చని చిగురులతో కొత్తదనం సంతరించుకొని, వినూత్నంగా పున:ప్రారంభమయ్యే ప్రకృతి కాలచక్రానికి హోలీ పండుగ స్వాగతం పలుకుతుందని వారు చెప్పారు. ప్రేమ, ఆప్యాయత, సౌభ్రాతృత్వానికి ప్రతీక అయిన రంగుల పండుగ అందరి జీవితాల్లో ఆనందాన్ని తీసుకురావాలని ఆకాంక్షించారు.

### సహజ రంగుల తయారీ ఇలా

- రెండు చెంచాల పసుపు పొడిలో నాలుగు చెంచాల గంధం పసుపు పొడి కలిపితే ఉన్నతమైన పసుపు రంగు వస్తుంది.
- మోదుగు పూలను ఉడక బెట్టి సహజ సిద్ధమైన రంగులు తయారు చేసుకోవచ్చు.
- బీట్ రూట్‌ను నీటిలో మెత్తగా ఉడికించి నీటిలోనే పిండిగా మారిస్తే ఎరుపు రంగు వస్తుంది.
- ఎర్ర చందనాన్ని నీటిలో కలిపితే ఎరుపు రంగును పొందవచ్చు.
- గోరింటాకును రుబ్బి పిండిలో కలిపితే ఆకు పచ్చ రంగును తయారు చేసుకోవచ్చు.
- నల్ల ద్రాక్ష పళ్లను నీటిలో నాన బెట్టి మెత్తగా ఉడకబెట్టి తొక్కలు, గింజలను వేరు చేస్తే అందమైన వంకాయ వర్ణం వస్తుంది.
- బంతి పువ్వులు, మందార పుష్పాలను నీటిలో నానబెట్టి పిసికితే ఆయా పుష్పాల రంగును బట్టి రంగులను పొందవచ్చు.
- నీలి మందును నీటిలో కలిపితే నీలి రంగు వస్తుంది.
- తులసి, వేప, కలబంద ఆకులు కలిపి నూరి నీటిలో కలిపితే ముదురు ఆకుపచ్చ వర్ణం, మంచి సువాసన వస్తుంది.
- మెంతు ఆకులు మైదా పిండి కలిపితే కూడా రంగులు తయారు చేసుకోచ్చు

### హోలీలో పాటించాల్సిన జాగ్రత్తలు

- కోడిగుడ్లు, రసాయన రంగులు వాడకూడదు
- శరీరాన్ని పూర్తిగా కప్పివేసి ఉంచే దుస్తులను ధరించాలి
- శరీరానికి కొబ్బరినూనె రాసుకుని హోలీ జరుపుకోవడం ఉత్తమం
- రసాయన రంగులను చల్లుకోవడంతో చర్మ వ్యాధులు వచ్చే అవకాశముంది
- వేడుకల్లో కండ్లకు అద్దాలతోపాటు చెప్పులు వేసుకోవాలి.

# భువనగిరి కాంగ్రెస్‌లో మళ్లీ బీసీ రాగం

## ఎంపీ సీటు బీసీలకే ఇవ్వాలన్న రాజగోపాల్ రెడ్డి

- ఎన్నికల వేళ రాజకీయాల్లో కీలక మలుపులు
- అసెంబ్లీ ఎలక్షన్లలోనూ నేతల బీసీ నినాదం
- ఆఖరికి రెడ్డి నాయకుడికే ఎమ్మెల్యే సీటు ఖరారు
- బీసీలను ఆటలో పావులా మార్చేస్తున్న హస్తం పార్టీ
- తీవ్రంగా మండిపడుతున్న బీసీ సమాజం

యాదాద్రి భువనగిరి, మార్చి 24 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ భువనగిరి పార్లమెంట్‌లో కొత్త నినాదం రాజకీయాలను రక్తి కట్టిస్తున్నది. ఆ పార్టీలో మళ్లీ బీసీ రాగం తెరపైకి వచ్చింది. ఎంపీ సీటు బీసీలకే ఇవ్వాలనే డిమాండ్ వినిపిస్తున్నది. తాజాగా లోక్‌సభ టికెట్ బీసీలకే ఇవ్వాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కొత్త రాగం అందుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ నాటి ఎంపీ, ప్రస్తుతం రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితోపాటు కాంగ్రెస్ నేతలు బీసీలకే టికెట్ ఇవ్వాలని బలంగా పట్టుబట్టి చివరలో చేతులెత్తేశారు. కాంగ్రెస్ రాజకీయ ఆటలో తమను పావుల్లా మార్చేస్తున్నారని బీసీ సమాజం మండిపడుతున్నది.

### పరిశీలనలో లేని బీసీ నేతల పేర్లు

లోకసభ ఎన్నికలకు ఎలక్షన్ కమిషన్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. వచ్చే నెలలో నోటిఫికేషన్ రిలీజ్ కానున్నది. ఇప్పటికే అన్ని పార్టీలు అభ్యర్థుల ఎంపికలో తలమునకలయ్యాయి. కాంగ్రెస్ పార్టీ నల్లగొండ అభ్యర్థిని ప్రకటించినప్పటికీ, భువనగిరి స్థానాన్ని మాత్రం పెండింగ్‌లో పెట్టింది. సీటు కోసం పలువురు నేతలు గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తున్నది. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తన అన్న కొడుకు పవన్ రెడ్డిని, రాజగోపాల్ రెడ్డి తన భార్య లక్ష్మిరెడ్డిని బరిలో నిలుపాలని వేర్వేరుగా లాబీయింగ్ చేసినట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్నది. వీరితోపాటు మరి కొందరు కూడా టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. హఠాత్తుగా రాజగోపాల్ రెడ్డి మాత్రం బీసీలకు టికెట్ ఇవ్వాలని మీడియా సమావేశంలో డిమాండ్ చేశారు. అసలు బీసీ నేతల పేర్లే పెద్దగా పరిశీలనలో లేవు. అలాంటిది ఒక్కసారిగా బీసీ రాగం ఎత్తుకోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది.

### అసెంబ్లీ ఎన్నికల్లోనూ అదే నినాదం..

భువనగిరి అసెంబ్లీ సీటును బీసీలకే ఇవ్వాలని మొదటి నుంచి కాంగ్రెస్‌లోని ఓ వర్గం పట్టుబడుతూ వచ్చింది. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సైతం బీసీలకే ఇవ్వాలని ప్రకటించారు. బీసీ నినాదంతో అప్పటికే క్షేత్రస్థాయిలో దూసుకెళ్తున్న కుంభం అనిల్ కుమార్ రెడ్డికి ఇబ్బంది కలిగించే ప్రయత్నం జరిగింది. ఆయనకు వ్యతిరేకంగా కొందరు హస్తం పార్టీలోని సీనియర్ బీసీ నేతలు ఫంక్షన్ హాల్‌లో రహస్యంగా సమావేశాలు నిర్వహించారు. కొందరు బహిరంగంగానే డిమాండ్ చేశారు. కుంభంకు వ్యతిరేకంగా ముందుకెళ్లారు. దాంతో కాంగ్రెస్‌లో సొంతింటి పోరు తట్టుకోలేక కుంభం పార్టీ మారడం, తర్వాత తిరిగి సొంత గూటికి చేరడం జరిగిపోయాయి. అప్పటి వరకు బీసీ నినాదం ఎత్తుకున్న నేతలంతా ఒక్కసారిగా సైలెంట్ అయిపోయారు. ఆఖరికి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతకు టికెట్ దక్కింది. పార్లమెంట్ పరిధిలో ఇద్దరు బీసీలకు టికెట్ ఇవ్వాలన్న కాంగ్రెస్ డిక్లరేషన్‌ను తుంగలో తొక్కారు.

### బీసీల పేరుతో రాజకీయం

కాంగ్రెస్ అంటేనే రెడ్ల పార్టీ అని ముద్ర ఉన్నది. అలాంటి పార్టీ బీసీలను ఆటలో పావులా మార్చేస్తున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాజకీయాలకు అవసరం వచ్చిన ప్రతి చోటా బీసీలను ఎరగా వేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ ఇదే జరిగింది. బీసీలను ముందు పెట్టి.. అగ్రవర్ణాల నేతలు లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారు. ఆఖరికి బీసీ నేతలను రాజకీయ ఆటలో బలి చేస్తున్నారనే ప్రచారం జరుగుతున్నది. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల్లో ఇదే స్పష్టంగా కనిపిస్తున్నది. దీనిపై బీసీ సమాజం పెద్దఎత్తున మండిపడుతున్నది. నిజంగా బీసీలకు టికెట్ ఇస్తే స్వాగతిస్తామని, కానీ బీసీల పేరుతో రాజకీయాలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరిస్తున్నారు.

### ఎవరిని అడ్డుకోవడానికి బీసీ కార్డు..?

భువనగిరి పార్లమెంట్ టికెట్ కోసం ఇప్పటి వరకు బీసీ కార్డు ఉపయోగించ లేదు. టికెట్ రేసులో ఉన్నోళ్లంతా రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారే. వారిలో చామల కిరణ్‌కుమార్ రెడ్డి, కీర్తి రెడ్డి, కోమటిరెడ్డి లక్ష్మి, సూర్యపవన్ రెడ్డి తదితర పేర్లు ఉన్నాయి. పున్న కైలాష్ నేత పేరు మొదట్లో వినిపించినా తర్వాత సైలెంట్ అయ్యిందని చెప్పవచ్చు. అయితే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఇప్పుడే ఎందుకు తెరపైకి తెచ్చారనేది రాజకీయాల్లో హాట్‌హాట్‌గా చర్చ నడుస్తున్నది.


ఎండిపోయిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

## పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

మోతె, మార్చి 24 : నీళ్లు లేక వరి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ కోరారు. మోతె మండల పరిధిలోని రాఘవాపురం ఎక్స్ రోడ్డు వద్ద ఆదివారం ఎండిపోయిన వరి పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించిన తెలంగాణలో మాజీ సీఎం కేసీఆర్ రైతాంగాన్ని సస్యశ్యామలం చేస్తే, మూడు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆగం చేసిందన్నారు. రైతులు ఎకరానికి రూ.30వేల వరకు పెట్టుబడులు పెట్టి వరి సాగు చేశారని, చేతికొచ్చిన పంటలు నీళ్లు లేక ఎండిపోవడంతో తీవ్రమైన నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పంట పొలాలు ఎండిపోతుంటే మంత్రులు కనీసం సమీక్ష నిర్వహించడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శీలం సైదులు, కార్యదర్శి మద్ది మధుసూదన్‌రెడ్డి, మిక్కిలినేని సతీశ్, జానీపాషా, నూకల శ్రీనివాస్‌రెడ్డి, గాంధీనాయక్, కోటేశ్, కాకి సురేందర్ రెడ్డి, భిక్షం, ఇండ్ల వెంకటేశ్వర్లు, ముత్తయ్య, సాజ్యానాయక్, పిట్ల నగేశ్, ప్రభాకర్‌రెడ్డి, కనకయ్య ఉన్నారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకన్నను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

## పోలీసుల వేధింపులు తట్టుకోలేక రైతు ఆత్మహత్యాయత్నం

- వారం రోజులుగా ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవైనం
- బాధితుడిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నీలగిరి, మార్చి 24 : నల్లగొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గంలో పోలీసుల వేధింపులు తాళలేక ఓ రైతు ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వారం రోజులుగా నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చావుబతుకుల నడుమ కొట్టుమిట్టాడుతున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. కట్టంగూర్ మండలం ఈదులూరు గ్రామానికి చెందిన బెల్లి వెంకన్న, లింగయ్య ఇద్దరు అన్నదమ్ముళ్లు. కాలం కలిసి రాకపోవడంతో వెంకన్న బతుకుదెరువు కోసం బొంబాయి పోయాడు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుల కోసం చేపట్టిన పథకాలతో వెంకన్న బొంబాయి నుంచి స్వగ్రామానికి వచ్చి ఇక్కడే వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో మార్చి 18న వెంకన్న, లింగయ్య ఇద్దరు అన్నదమ్ముళ్ల పశువుల కొట్టం వద్ద గుర్తుతెలియని వ్యక్తులు పశువుల గడ్డిని తగులబెట్టారు. దాంతో లింగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంకన్నపై అనుమానంతో కట్టంగూర్ ఎస్ఐ అతన్ని పిలిచి విపరీతంగా కొట్టి అదే రోజు సాయంత్రం విడుదల చేశారు. ఇంటికి వెళ్లిన వెంకన్న జరిగిన విషయాన్ని తన భార్యకు చెప్పడంతో తన భర్తకు సంబంధం లేని విషయంలో కేసు పెట్టి కొట్టడంతో ఆవేశంలో ఆక్రోశాన్ని వెల్లగక్కింది. దాన్ని రికార్డు చేసిన లింగయ్య మరుసటి రోజు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దాంతో మరోసారి వెంకన్నను ఎస్ఐ స్టేషన్‌కు రమ్మని చెప్పడంతో ముందురోజు జరిగిన సంఘటనను గుర్తు చేసుకుని చేసేది లేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు నల్లగొండలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.

### ఎస్ఐని సస్పెండ్ చేయాలి : మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

కారణాలు లేకుండా స్టేషన్‌కు పిలిచి విపరీతంగా కొట్టిన కట్టంగూర్ ఎస్ఐని సస్పెండ్ చేయాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. ఆదివారం నల్లగొండలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకన్నను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకన్న దుస్థితికి కారణమైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని, ఆస్పత్రి ఖర్చులు ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు.

# హుజూర్‌నగర్ కేడర్ అంతా బీఆర్‌ఎస్ వెంటే..

**నాయకుడు వెంట వెళ్లని కార్యకర్తలు**

- సైదిరెడ్డి ఫోన్లు చేసి బతిమాలినా వినిపించుకోని పరిస్థితి
- ఇటీవల మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సమీక్షకు పెద్ద సంఖ్యలో హాజరైన బీఆర్‌ఎస్ శ్రేణులు
- జగదీశ్‌రెడ్డి భరోసాతో ఉత్సాహంలో నేతలు


ఈనెల 20న హుజూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి భారీగా హాజరైన బీఆర్‌ఎస్ కార్యకర్తలు

సూర్యాపేట, మార్చి 24 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల తర్వాత హుజూర్‌నగర్ నియోజకవర్గంలో రాజకీయంగా పలు మార్పులు చోటు చేసుకున్నాయి. బీఆర్‌ఎస్ తరపున శాసన సభ అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ఎన్నికల్లో ఓడిపోయారు. ఆయన బీఆర్‌ఎస్ పార్టీకి ద్రోహం చేస్తూ ఇటీవల బీజేపీలో చేరారు. కానీ ఆయన వెంట ఒక్క నాయకుడుగానీ, కార్యకర్త గానీ వెళ్లలేదు. అంతా గులాబీ పార్టీలోనే ఉన్నారు. దాంతో శానంపూడి బీఆర్‌ఎస్ శ్రేణులకు ఫోన్లు చేస్తూ తన వెంట రావాలని బతిమాలుతున్నారు. 'నీ దారి నీవు చూసుకున్నావు.. మా దారి గులాబీ దారి' అంటూ బీఆర్‌ఎస్ శ్రేణులు కరాఖండిగా చెబుతున్నారు.

### ఎంపీ టికెట్ ఖరారు చేసినా ఏకాకిగా..

బీజేపీలో చేరిన సైదిరెడ్డికి నల్లగొండ ఎంపీ టికెట్ ఖరారు చేసి పదిరోజులు గడుస్తున్నప్పటికీ ఆయన వెంట ఓ నాయకుడుగానీ, కార్యకర్తగానీ లేకపోవడంతో ఏకాకిగా మిగిలిపోయారు. జిల్లాలో ఉన్న బీజేపీ నాయకులు సైతం సైదిరెడ్డిని కలువకపోవడం, సైదిరెడ్డి బీజేపీ నాయకులను సంప్రదించకపోవడం కనిపిస్తున్నది. ఈ నేపథ్యంలో సైదిరెడ్డికి నల్లగొండ ఎంపీ అభ్యర్థిత్వానికి బీజేపీ నుంచి ఏ మేరకు మద్దతు లభిస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది. అంతే కాకుండా నాటి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రజా సంగ్రామ యాత్రలో భాగంగా మఠంపల్లి మండలంలో భూములు కబ్జా చేశారంటూ అక్కడ ఉన్న ఫెన్సింగ్‌లను తొలగించడంతో బీజేపీ, బీఆర్‌ఎస్ మధ్య ఓ యుద్ధమే జరిగింది. నాడు బీజేపీ నాయకులపై కేసులు కాగా దానికి కారణమైన సైదిరెడ్డిని పార్టీలో చేర్చుకోవడం పట్ల జిల్లా బీజేపీ శ్రేణులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఆ పార్టీ అధిష్టానంపై అసహనంతో ఉన్నారు. చూడాల్సిందే.

### బీఆర్‌ఎస్ కార్యకర్తలకు జగదీశ్‌రెడ్డి భరోసా

ఇటీవల మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి హుజూర్‌నగర్‌లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి భరోసా కల్పించారు. గ్రామాల వారీగా పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. మూడు నెలల వరకు నియోజకవర్గాన్ని తానే చూసుకుంటానని, ఎవరూ ఎలాంటి అపోహలకు గురికావాల్సిన అవసరం లేదని చెప్పి శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. 2009 ఎన్నికల్లో హుజూర్‌నగర్ నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా జగదీశ్‌రెడ్డి బరిలో ఉండగా నాటి నుంచి పార్టీ కోసం పనిచేసిన వారు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. 2014, 2018తోపాటు ఇటీవల 2023 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపుకోసం వారు ఎంతో కష్టపడ్డారు. గత ఎన్నికల్లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తానే సీఎం అభ్యర్థిని అని ప్రచారం చేసుకున్నా అంత మెజార్టీ రాలేదు. తాము ఏ ఎన్నికలు వచ్చినా బీఆర్‌ఎస్‌వాదులుగానే ఉంటామని, పార్టీకి సహకరిస్తామని నాయకులు, కార్యకర్తలు స్పష్టం చేస్తున్నారు. సైదిరెడ్డి ఫోన్లు చేసినా బీజేపీలోకి వెళ్లేది లేదని, త్వరలో జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు భారీ మెజారిటీ వచ్చేలా పని చేస్తామని ముక్తకంఠంతో చెబుతున్నారు. బీఆర్‌ఎస్‌లో సుమారు 60వేల మంది కేడర్ ఉంటే అందరినీ వీడి బీజేపీలో చేరి నలుగురు కూడా లేకుండా సైదిరెడ్డి ఏకాకయ్యాడని బీఆర్‌ఎస్ శ్రేణులు సెటైర్లు వేస్తున్నారు. ఇదిలా ఉంటే జిల్లా బీజేపీలో తొంభైశాతం సైదిరెడ్డిని వ్యతిరేకిస్తూ నల్లగొండ ఎంపీ అభ్యర్థిత్వాన్ని మార్చాలని అధిష్టానం వద్ద పట్టుబడుతున్నట్లు తెలుస్తుండగా అభ్యర్థిత్వాన్ని కూడా మార్చే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. మరికొన్ని రోజుల్లో ఏం జరుగుతుందనేది వేచి

